క్లుప్తంగా

ఘనంగా పోలేరమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని పోలేరమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తొండపిలో అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల

మండలంలోని తొండపి గ్రామంలో వేంచేసియున్న అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణ నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సింగారావు పాల్గొని మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. దమ్మాలపాడుకు చెందిన దాసరి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం మాదల గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ దాసరి నాగబాబు ఆర్థిక సాయంతో మజ్జిగ పంపిణీ చేపట్టారు. 21 సంవత్సరాల నుంచి నిర్విరామంగా చలివేంద్రాన్ని కొనసాగిస్తున్న హోంగార్డు సుభానిని తహసీల్దార్ సింగారావు అభినందించారు. కార్యక్రమంలో వీఆర్వో బి.హరిబాబు, పంచాయతీ కార్యదర్శి జి.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

సత్తెనపల్లి: పచ్చిరొట్ట పైరు తొలకరి వర్షాలకు వేయడం ఎంతో మంచిది. జీలుగ, జనుము, పిల్లి పెసర తదితర పైర్లు ఇందుకు అనువైనవి. పంట పూత దశకు రాగానే కలియ దున్నేయాలి. పచ్చి రొట్టె పైర్లు సంపూర్ణ ఎరువులు. వీటిలో పంటకు కావలసిన ముఖ్యపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, ఉపపోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, సూక్ష్మ పోషకాలైన జింక్, బోరాన్, ఇనుము తదితరాలు లభ్యమవుతాయని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పచ్చిరొట్ట ఎరువు పైర్లు సాగు లాభదాయకమని చెప్పారు. జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తన ధరలను రాష్ట్ర వ్యవసాయ శాఖ ఖరారు చేసిందన్నారు. సత్తెనపల్లి మండలానికి జీలుగ 55 క్వింటాళ్లు, జనుము 64 క్వింటాళ్లు, పిల్లిపెసర 100 కింటాళ్లు మొత్తం 219 క్వింటాళ్లు ప్రతిపాదించటం జరిగిందన్నారు. 50 శాతం రాయితీపై రైతులకు అందజేస్తా మన్నారు. వీలైనంత త్వరలో రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు సరఫరా చేయనున్నామని, విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని ఆయన తెలిపారు.

జూన్ 9న ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: హైందవ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ జూన్ 9న పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో జరుగుతుందని ఛత్రపతి శివాజీ కళా పరిషత్, ఛత్రపతి శివాజీ యూత్, ఆర్య మరాఠ సంఘం బాధ్యులు గురువారం తెలిపారు. జూన్ 9న మధ్యాహ్నం 12.21 గంటలకు ఈ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు ఫిరోజి రుషీంద్రుల వారి మఠం నుంచి మహారాష్ట్ర వీధి వరకు కోలాటం, నృత్యం, మేళతాళాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. ఉదయం 9.00 గంటలకు కాషాయం ధ్వజ పూజ, 9.30 గంటలకు తుల్జాభవాని అమ్మవారి పూజ, 10.00 గంటలకు తుల్జాభవాని అమ్మవారి హోమం జరుగుతుందన్నారు. 12.33 గంటలకు అన్న సంతర్పణ జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరారు.

చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

సత్తెనపల్లి: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో గల చెక్‌పోస్ట్ వద్ద గురువారం పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డాక్యుమెంట్స్ లేని ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నారు. దీనిపై పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వయోజనులకు క్షయ వ్యాధి నిర్మూలన టీకా



గోళ్ళపాడులో బీసీజీ వ్యాక్సిన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డాక్టర్ అర్జునరావు



క్షయ నిర్మూలన టీకా వేస్తున్న ఆరోగ్య కార్యకర్త, ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్

గోళ్ళపాడులో క్షయ వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన డాక్టర్ అర్జునరావు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ క్షయ వ్యాధి రాకుండా ముందస్తుగా నివారణ టీకాలు అందించటం జరుగుతుందని చైల్డ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్, పల్నాడు జిల్లా అడల్ట్ బీసీజీ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు, చాగంటివారిపాలెం గ్రామాల్లో జరుగుతున్న క్షయవ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అరవై సంవత్సరాలు పైబడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగతాగే అలవాటు ఉన్న వారికి, క్షయ వ్యాధి గ్రస్తులు ఉన్న కుటుంబసభ్యులకు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. ప్రతి గురువారం అన్ని గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలో 286 మందికి వ్యాక్సిన్ అందించామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్నాడు డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ బి.హనుమకుమార్, జిల్లా టీబీ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు ఎ.పీటర్‌డేమియన్, ఎం.జోస్పిన్ రాణి, ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: జాతీయ క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు 2025వ సంవత్సరం నాటికి క్షయ వ్యాధిని అంతం చేయడానికి, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బలహీనమైన వ్యక్తులకు, పెద్ద వయసు ఉన్న వారికి బీసీజీ టీకాను ప్రతి గురువారం గ్రామ సచివాలయాల్లో ఇస్తున్నట్లు క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాల అంకమ్మబాయి గురువారం తెలిపారు. టీబీ వ్యాధి రావడానికి ఎక్కువ అవకాశం ఉన్న పెద్ద వయసు ఉన్న వారికి బీసీజీ టీకా ఇవ్వడం ద్వారా సమాజంలో కొత్త టీబీ కేసుల సంఖ్య తగ్గుతుందన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, 60 సంవత్సరముల వయసు దాటిన వారు, ఐదు సంవత్సరాల క్రితం 18 ఏళ్లు నిండి టీబీ వ్యాధికి గురైన వారు, 1 జనవరి 2021 తర్వాత టీబీ వ్యాధి గురి అయిన వారి కుటుంబ సభ్యులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కేజీలు (చదరపు మీటరు కన్నా) తక్కువ ఉన్నవారికి, పొగతాగే అలవాటు ఉన్నవారు వయోజన బీసీజీ టీకాకు అర్హులని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ కూడా మండలంలోని అన్ని సచివాలయాల్లో ఈ టీకా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వారు, హెచ్ఐవీ సోకిన వారు, గర్భవతులు, గుండె వ్యాధులకు చికిత్స తీసుకుంటున్న వారు, డయాలసిస్, క్యాన్సర్ వ్యాధికి చికిత్స చేయించుకుంటున్న వారు వయోజన బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోకూడదని పేర్కొన్నారు. ఈ టీకా కొరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

విద్యతోనే గౌరవం



భట్లూరులో విద్యా చైతన్య ప్రచారోద్యమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్

సత్తెనపల్లి: సమాజంలో గౌరవం పొందాలంటే విద్య తప్పనిసరి అని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో గురువారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన విద్యా చైతన్య ప్రజారోద్యమ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి బడికి వెళ్లి చదువుకోవటం వలన గౌరవంగా ఉంటారన్నారు. చదువుకోవటం వలన పరిశుభ్రత, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత అన్నీ తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఆ దిశగా విద్యనభ్యసించడం ద్వారా అందరికీ సమాన అవకాశాలు ఉంటాయన్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి ప్రభుత్వం అందిస్తున్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక ద్వారా ఉన్నటువంటి అవకాశాలను పొందాలన్నారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలందరిని తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొని విద్యా చైతన్య ప్రచార ఉద్యమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మౌనిక, తదితరులు ఉన్నారు.

రైతులకు నాణ్యమైన మొక్కలు విక్రయించండి



హార్టీకల్చర్ అధికారి శ్రీనివాస్ సురేష్

మాచర్ల రూరల్: నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి నర్సరీలలో రైతులకు మేలైన మొక్కలను అందించాలని హార్టీకల్చర్ అధికారి శ్రీనివాస్ సురేష్, త్రిమూర్తి సీడ్స్ ఏజీఎం నర్సారెడ్డి కోరారు. గురువారం మండలంలోని కొత్తపల్లి, రాయవరం గ్రామాలలో నర్సరీ యజమానులకు అవగాహన కల్పించి మాట్లాడారు. రైతులందరూ ఆర్ఎన్‌డీ కంపెనీ విత్తనాలను కొనుగోలు చేయాలని, రైతులకు మొక్కల కొనుగోలు సమయంలో రశీదును యాజమాన్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం మల్లారెడ్డి, సేల్స్ మేనేజర్ వడితె శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని సత్యసాయిబాబా మందిరం వద్ద భగవాన్ శ్రీ సత్యసాయి మందిరం వారి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికి 17 రోజుల నుంచి మజ్జిగ పంపిణీ చేయటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కౌన్సిలర్ కొత్త పుష్పలత సహకారంతో 2,500 మందికి మజ్జిగ పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయిబాబా దేవాలయం నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

తప్పిపోయాడు.. క్షేమంగా ఇంటికి చేరాడు

నాదెండ్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయిన మతిస్థిమితం లేని వృద్ధుడి ఆచూకీ గురువారం లభ్యమైంది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం, వేములపాడు గ్రామానికి చెందిన ముప్పరాజు లక్ష్మీనారాయణ ఈ నెల 19న గణపవరంలో నివసించే తన కుమార్తె ఆలా శ్రీలక్ష్మి ఇంటికి వచ్చాడు. సాయంత్రం బయటకు వెళ్లిన లక్ష్మీనారాయణ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెతుకులాట ప్రారంభించిన పోలీసులు గురువారం ఉదయం గణపవరంలోని వేలూరు డొంకలో వృద్ధుడిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో లక్ష్మీనారాయణను కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తరలించారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉంగుటూరు విద్యార్థుల ప్రతిభ



పి.దివ్య



బి.సంజన



పి.తేజ

అమరావతి: క్రోసూరు ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరం 6వ తరగతి ప్రవేశ పరీక్షలో మండలంలోని ఉంగుటూరు ఎంపీపీఎస్ ఎల్ఈ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడు ర్యాంకులు కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పన గురువారం తెలియజేశారు. పాఠశాలకు చెందిన పి.దివ్య మూడవ ర్యాంకు, బి.సంజన నాల్గవ ర్యాంకు, పి.తేజ తొమ్మిదవ ర్యాంకు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుడు మోహన్, గ్రామస్తులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

అనుపులో టిబెట్ బౌద్ధ భిక్షువులు



బౌద్ధ చరిత్రను వివరిస్తున్న ఫ్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్యాంక్ బుద్ధ వనంలో జరిగిన 2568వ బుద్ధ జయంతి వేడుకలలో అతిథులుగా పాల్గొన్న టిబెట్ బౌద్ధ భిక్షువులు గురువారం మాచర్ల మండలం అనుపులోని బౌద్ధ కట్టడాలను సందర్శించారు. అనుపులోని ఇక్ష్వాకుల కాలం నాటి బౌద్ధ చరిత్ర, కట్టడాలు, శిల్పాలు, శాసనాలు, స్థూపాలు, చైత్యాలు, విహారాల గురించి బుద్ధ వనం కన్సల్‌టెంట్, ఫ్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం బౌద్ధ భిక్షువులు గేషె నవాంగ్ జుంగ్నే, జంపాకుంగ మాట్లాడుతూ బుద్ధ జయంతి రోజున బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించటం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, మహాయాన సిద్ధాంత కర్త, మాధ్యమిక, శున్యవాదాలను స్థిరీకరించిన ఆచార్య నాగార్జునుడు తమకు అత్యంత గౌరవనీయుడని తెలిపారు. దీనికి ముందు బౌద్ధ భిక్షువులు అనుపు బౌద్ధ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బౌద్ధ అభిమానులు గ్రంధి రామకృష్ణ, నాగార్జున పాల్గొన్నారు.

మరోమారు చోరీకి విఫలయత్నం



దుకాణంలో చోరీ ప్రయత్నం చేస్తున్న గుర్తు తెలియని దుండగుడు (సీసీ ఫుటేజ్)

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో ఓ దుకాణంలో చోరీకి విఫలయత్నం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. లింగారావుపాలెం గ్రామానికి చెందిన తులాబందుల సప్తాంజనేయులు యడ్లపాడు హైవే పక్కన సరుకుల దుకాణంలో బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని దుండగుడు చోరీకి యత్నించాడు. రోజు మాదిరిగానే వ్యాపారం ముగిసిన వెంటనే దుకాణానికి తాళాలు వేసుకుని ఆంజనేయులు వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం దుకాణం తెరిచేందుకు తాళాలు చూడగా మూడు తాళాలు రెండు పగలగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను గమనించాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ముఖానికి ధరించి బ్లూ కలర్ దుస్తులతో వచ్చిన యువకుడు దుకాణం రెండు తాళాలను ధ్వంసం చేసినట్లు గుర్తించాడు. అదే సమయంలో పాల వాహనాలు దుకాణం వైపు రావడంతో భయంతో చోరీయత్నాన్ని విరమించుకొని అక్కడి నుంచి దుండగుడు ఉడాయించాడు. రెండు నెలల కిందట ఇదే దుకాణంలో తాళాలు పగలగొట్టి గల్లా పెట్టెలోని రూ.6 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



నరసరావుపేట రూరల్: పట్టణంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మస్తానమ్మ ఆధ్వర్యంలో స్టేషన్‌రోడ్డులోని దుకాణాల్లో తనిఖీలు జరిపి దుకాణాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన విత్తనాలు మాత్ర మే రైతులకు విక్రయించాలని, డీలర్లు సోర్స్ సర్టిఫికెట్స్ కలిగి ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు లు ఇవ్వాలని తెలిపారు. ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ వివరాలు తెలియజేసేలా ధరలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ



నరసరావుపేట రూరల్: ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆఫీసర్ డాక్టర్ ఎం.లత తెలిపారు. జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని రావిపాడులో ప్లాస్టిక్ నిషేధంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిత్యం ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు, సంచుల వలన పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. క్యాన్సర్, నరాల బలహీనత వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ బదులుగా గ్లాస్, స్టీల్‌ను ఉపయోగించాలని సూచించారు. అలాగే సాయంత్రం సమయంలో మహిళలకు పెరటి తోటల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.రమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ
- డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయంలో వార్షిక తనిఖీ



విద్యార్థులకు బోధన చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ

సత్తెనపల్లి: తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపి జ్ఞానాన్ని పెంపొందించుకునేలా చూడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరాల పనితీరును పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు విజ్ఞానం అందించే నీతి కథలు, రాజకీయ చరిత్ర, దేశ నేతల చరిత్ర తెలపడంతో పాటు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడం వంటివి చేపడుతున్నామన్నారు. విజ్ఞానం ఓవైపు... మరోవైపు వివిధ ఆటలు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరానికి విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచాలని సూచించారు. వార్షిక తనిఖీ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా గ్రంథాలయంలోని విద్యార్థులకు పలు అంశాలను బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కె.వాణి, సిబ్బంది రజిని, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

క్రోసూరులో వేసవి శిక్షణ శిబిరం...

క్రోసూరు: వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించటం జరిగింది. శిబిరంలో విద్యార్థులు పొందుతున్న తర్ఫీదు ద్వారా తెలుసుకుంటున్న విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిబిరానికి అధిక సంఖ్యలో హాజరయ్యేలా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోటివేట్ చేయాలని గ్రంథాలయ అధికారికి సూచించారు. వార, పక్ష మాస పత్రికలను పెంచాలని చెప్పారు. రీడర్‌షిప్, మెంబర్‌షిప్ పెంచాలని, గ్రంథాలయ సెస్సు వసూలయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



అమరావతి: ప్రముఖ బౌద్ధ కేంద్రంగా వెలుగొందుతున్న అమరావతిలో బుద్ధ జయంతిని పురస్కరించుకుని గురువారం బౌద్ధ సంప్రదాయనుసారం పూజలు నిర్వహించారు. స్థానిక పాత మ్యూజియంలోని మహాచైత్యం వద్ద ధాన్య కటక బౌద్ధ విహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు ఆధ్వర్యంలో స్తూపారాధన, పుష్పార్చన నిర్వహించి, ఆచార్య నాగార్జున విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మ్యూజియంలోని బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నిమ్మా విజయ సాగరబాబు, యోగాశ్రమ కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మీ పండిట్, తదితరులతో పాటు గ్రామస్తులు, బౌద్ధ మతాభిమానులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లమెంటరీకి సర్వం సిద్ధం

సత్తెనపల్లిలో 3 కేంద్రాల్లో నిర్వహణ

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలను సత్తెనపల్లి పట్టణంలో మూడు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 4,447 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు సంబంధించి సిబ్బందిని నియమించారు. పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రగతి జూనియర్ కళాశాలలో మొత్తం 1,155 మంది, కృష్ణవేణి జూనియర్ కళాశాలలో 979 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2,313 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా శుక్రవారం జరిగే సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1కు సంబంధించి ప్రగతి జూనియర్ కళాశాలలో 120 మంది, కృష్ణవేణి జూనియర్ కళాశాలలో 83 మంది, సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1, పేపర్-2కు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 103 మంది కలిపి మొత్తం 306 మంది పరీక్ష రాయనున్నారు.

నేటి నుంచి 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో నేటి నుంచి 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మల్లిఖార్జున శర్మ గురువారం తెలిపారు. పరీక్ష కేంద్రంలో రాజుపాలెం, బెల్లంకొండ మండలాలకు చెందిన 300 మంది విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు మొదలవుతాయన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లు తీసుకొని పరీక్ష కేంద్రానికి రావాలని తెలిపారు.

8 వేల పాఠ్య పుస్తకాలు సిద్ధం

పాఠశాలలు పునః ప్రారంభానికి ముందుగానే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో మల్లిఖార్జున శర్మ తెలిపారు. ఇప్పటికే విద్యాశాఖాధికారి కార్యాలయానికి మొదటి విడతగా 8 వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పంపిస్తారని చెప్పారు.

వైభవోపేతంగా రంగనాథుని కల్యాణం



కల్యాణ వధూవరులుగా శ్రీదేవి భూదేవి రంగనాథుడు



కల్యాణ వేడుకలకు హాజరైన భక్తజనం

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచి వున్న శ్రీభూ-సమేత రంగనాయక స్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. నవ వధూవరులుగా శ్రీదేవి భూదేవి రంగనాయక స్వామి సర్వాంగ సుందరంగా అలంకార కృతులయ్యారు. పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో కల్యాణ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామస్తులే కాకుండా సమీప గ్రామాలు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణ పూజలను ఆలయ ధర్మకర్తలు అరవపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, అరవపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాలయంలో కొలువున్న ప్రసన్నాంజనేయ స్వామికి విశేష అలంకరణ గావించారు. ఆయా కార్యక్రమాలను ఈవో పర్యవేక్షించారు. గ్రామ పెద్దలు ప్రజలు సహకార అందించారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

వేల్పూరులో జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభమైనట్లు పాఠశాల హెచ్ఎం షేక్ మహమ్మద్ సుభాని గురువారం తెలిపారు. జూనియర్ కళాశాలలో బాలురు-బాలికలకు ప్రవేశం ఉందని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు. ఓపెన్ టెన్త్ పాసైన వారు కూడా అర్హులన్నారు. ఫీజు లేదని, అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.